నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, గురువారం 28 డిసెంబర్ 2023 | NAGARKURNOOL


### ఆరు గ్యారెంటీలు..

- మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా రూ.2,500 ఆర్థిక సాయం
- మహాలక్ష్మి పథకం కింద రూ.500కే సిలిండర్ పంపిణీ
- గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షల సాయం
- యువ వికాసంలో భాగంగా రూ.5లక్షల విద్యాభరోసా కార్డులు
- చేయూత పథకం కింద రూ.4 వేల పింఛన్
- వ్యవసాయ పెట్టుబడుల కోసం సంవత్సరానికి రూ.15వేలు అందించే రైతు భరోసాకు అలాగే కొత్తగా రేషన్ కార్డుల మంజూరుకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తారు.

### సభల అనంతరం లబ్ధిదారుల గుర్తింపు

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నేటి నుంచి గ్రామసభలు నిర్వహిస్తాం. ఇప్పటికే గ్రామ, మండల, డివిజన్‌స్థాయిలో అధికారుల నియామకం పూర్తైంది. ప్రతిరోజూ గ్రామాలు, మున్సిపాలిటీ వార్డుల్లో జనవరి 6 వరకు సభలు జరుగుతాయి. అధికారులంతా గ్రామాల్లోనే ఉంటారు. ప్రజలు ఇండ్లు, పింఛన్లు, సిలిండర్, ఉచిత విద్యుత్, రూ.2500 సాయం, రైతుభరోసా, రేషన్‌కార్డుల కోసం గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలి. సభల అనంతరం లబ్ధిదారులను గుర్తించి పథకాలను అమలు చేసేలాచర్యలు తీసుకుంటాం.

*- ఉదయ్‌కుమార్, కలెక్టర్, నాగర్‌కర్నూల్*



# నేటి నుంచి ప్రజాపాలన

- ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు
- గ్రామాలు, మున్సిపాలిటీల్లోనూ సభలు
- జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- గ్రామస్థాయి నుంచి ప్రత్యేక అధికారులు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో కలెక్టర్ల పర్యవేక్షణ

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈనెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు గ్రామస్థాయి సభలు నిర్వహించనున్నది. దీనికోసం ప్రత్యేక అధికారులను నియమించింది. కాగా ఇందులో ఆరు గ్యారెంటీలు అయిన మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం, చేయూత, రైతుభరోసా పథకాలతోపాటుగా రేషన్ కార్డులకు సైతం దరఖాస్తులను స్వీకరించనున్నది. ఈ ప్రక్రియ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన, వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరులోని కలెక్టర్లు వైస్ చైర్మన్లుగా కొనసాగనుంది. దీంతో గ్రామాలు, పురపాలికల్లో పది రోజులపాటు సందడి నెలకొననున్నది.

ఎన్నికల హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ సర్కారు శ్రీకారం చుడుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించనున్నది. ఇందులో భాగంగా ఆరు గ్యారెంటీల అమలు కోసం గ్రామాలు, పురపాలికల్లోని వార్డుల వారీగా సభలు నిర్వహించనున్నారు. ఇందులో అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. దీనికోసం ఇప్పటికే ఆయా గ్రామాలు, మండల, డివిజన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించింది. ప్రతి బృందంలో తాసీల్దార్ లేదా రెవెన్యూ అధికారి, ఎంపీడీవో లేదా ఆ శాఖ అధికారి, వ్యవసాయ, పౌరసరఫరాలు, వైద్య, విద్య, విద్యుత్, పంచాయతీ, పురపాలిక తదితర శాఖల అధికారులు ఉంటారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు వైస్ చైర్మన్లుగా గ్రామ పరిపాలనను పర్యవేక్షిస్తారు. దీనికోసం డిసెంబర్ 31, జనవరి 1వ తేదీ మినహాయించి ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నమూనాల ప్రకారం దరఖాస్తులను స్వీకరించి, రశీదులను ఇస్తారు. సభలపై ముందే టాంటాం నిర్వహించేలా కలెక్టర్లు ఆదేశించడం జరిగింది. సభల వివరాలను ప్రతిరోజూ ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా నివేదించాల్సి ఉంటుంది. ఉమ్మడి పాలమూరులో 19పురపాలికలు, 1,692గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మహిళలకు రూ.2500 అందించే మహాలక్ష్మి పథకానికి 7.21 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇక 5.55లక్షల గ్యాస్ కలెక్షన్లు ఉన్నాయి. అలాగే 9లక్షల మందికిపైగా రైతులు ఉన్నారు. ఇక ఇండ్ల కోసం 9లక్షల మంది ఎదురుచూస్తున్నారు. చేయూత పథకంలో 4లక్షల మంది పింఛన్‌దారులు లబ్ధిపొందుతున్నారు. ఈ ఆరు గ్యారెంటీలను రాబోయే ఆరు నెలల్లో అమలు చేసేలా ఆయా జిల్లాల అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వం ఇప్పటికే రెండు గ్యారెంటీలైన ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేస్తుండగా రోజుకు 80వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. ఇక రూ.10లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డులను 9.50లక్షల మందికి అందించనున్నారు. ఈ కార్డుల ద్వారా ప్రతి సంవత్సరం 30వేల మంది పేదలు దవాఖానల్లో వివిధ రకాలకు చికిత్సలు తీసుకొంటున్నారు. ఇలా ఆరు గ్యారెంటీల అమలుకు దరఖాస్తులను స్వీకరించడంతోపాటుగా రేషన్ కార్డులకు కూడా ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోనున్నారు. ఉమ్మడి పాలమూరులో 9.34లక్షల దరఖాస్తులుండగా ఇప్పటికే కొత్తకార్డుల కోసం 20వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇంకా వేలాది మంది ఎదురు చూస్తున్నారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి హామీల అమలు కోసం చేపట్టిన చర్యలతో ప్రజల్లో ఆనందం నెలకొన్నది.



రథోత్సవాన్ని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

# వైభవంగా రథోత్సవం

- అశేషంగా తరలివచ్చిన భక్తులు • ఆదిశిలాక్షేత్రంలో మార్మోగిన గోవిందనామం
- పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్, డిసెంబర్ 27 : ఆదిశిలా క్షేత్రంలో మంగళవారం అర్ధరాత్రి స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథోత్సవానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి తెలంగాణ జిల్లాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు అశేషంగా తరలివచ్చారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడగా ఆదిశిలా క్షేత్రం అంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి, ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ యాకోబు, వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, అజయ్, నరేందర్, బాబురావు, మధు, ఆంజనేయులు, మధు, భాస్కర్‌గౌడ్, తిమ్మరాజు, పరశురాముడు, నరేందర్‌శెట్టి పాల్గొన్నారు.

**స్వామివారికి ప్రత్యేక పూజలు..**

ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి దాసంగాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



చిన్నరాజమూర్‌లో ఆంజనేయస్వామి రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తజనం

# మార్మోగిన హనుమాన్ నామస్మరణ

- కనులపండువగా రథోత్సవం • వేలాదిగా తరలివచ్చిన భక్తజనం

దేవరకద్ర, డిసెంబర్ 27 : మండలంలోని చిన్నరాజమూర్‌లో వెలిసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం తెల్లవారు జామున కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి ముందు స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. రథోత్సవంలో భాగంగా ఆలయంలో అర్చకులు, వేదపండితులు పంచామృతాభిషేకం నిర్వహించి స్వామివారికి మహాఅలంకరణ చేశారు. అనంతరం అశేషంగా తరలివచ్చిన భక్తుల మధ్య హనుమాన్ నామస్మరణతో రథోత్సవం కార్యక్రమం చేపట్టారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మంచి చేయాలనే తపనతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు

- నేటి నుంచి ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించాలి
- మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు
- ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని కోరిన ఎమ్మెల్యేలు

### 'రైతు భరోసా' ఎప్పటి నుంచి..?



కొందరు ఇప్పటికే ఆసరా పింఛన్లు పొందుతున్నందున మహాలక్ష్మి పథకం కింద ఎప్పటి నుంచి లబ్ధిని అందజేస్తారో తెలియజేయాలి. ధాన్యం కొనుగోలు అనంతరం రూ.500 బోనస్ ఇస్తారని చెప్పారు. ఇప్పటికే రైతులు పండించిన ధాన్యం విక్రయాలు దగ్గర పడుతున్నాయి. బోనస్‌పై ఇప్పటి వరకు ప్రకటన చేయలేదు. రైతు భరోసా అమలు చేసే తేదీని కూడా తెలపాలి.

*- పోతుగంటి రాములు, నాగర్‌కర్నూల్ ఎంపీ*

మహబూబ్‌నగర్, డిసెంబర్ 27 : నిరుపేదలను ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు మంచి చేయాలనే తపనతో ప్రతి అధికారి పనిచేయాలని, అప్పుడే అందరికీ మంచి జరుగుతుందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లతో ప్రజాపాలనపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దామోదర రాజనర్సింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజలను ఉన్నత స్థాయికి తీసుకొచ్చేందుకు ప్రభుత్వాలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ షెడ్యూల్ ప్రకారం అధికారులు పట్టణంలోని వార్డులు, గ్రామాలకు వెళ్లి 5 గ్యారెంటీలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. గ్రామసభల్లో దరఖాస్తులు ఇవ్వని వారు జనవరి 6వ తేదీ వరకు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శి లేదా ప్రత్యేకాధికారికి అందించే వెసులుబాటు ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, ఇచ్చిన ప్రతి హామీని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని ప్రజలకు వివరించాలని సూచించారు.

**సందేహాలు నివృత్తి చేయాలి..**

ప్రజలకు ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించడంలో సందేహాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. వచ్చే నెల 6వ తేదీ తరువాత కూడా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కోరారు.

**ముందుగానే ఇంటికి దరఖాస్తు ఫారం..**

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ ముందుగానే దరఖాస్తు ఫారం అందిస్తామని వనపర్తి కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవర్ అన్నారు. అధికారులు ముందుగానే అందించిన ఫారాన్ని పూర్తి చేసి ప్రజాపాలన కార్యక్రమంలో అందిస్తే సరిపోతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ అనంతరం రశీదును అందిస్తామని, కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు విజయుడు, అనిరుధ్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్లు, కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు పాల్గొన్నారు.

### ప్రజలకు ఇబ్బంది రానివ్వొద్దు

గ్రామ జనాభాను పరిగణలోకి తీసుకొని వీలైనన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు తీసుకోవాలి. అధికారులకు ప్రజలు పడుతున్న ఇబ్బందులు త్వరగా తెలుస్తాయి. వారికి మరింత చేరువగా ఉంటూ సమస్యలను పరిష్కరించాలి. అందరి సహకారంతో విజయవంతం చేయాలి.

*- జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి*

### దరఖాస్తులు సరే.. అమలు ఎప్పుడు?



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ప్రజలకు మంచి చేయాలనే తపనతోనే ముందుకు సాగుతుంది. దరఖాస్తుల స్వీకరణ అనంతరం గ్యారెంటీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పడం లేదు. ప్రజలకు ఎన్నో సందేహాలు ఉన్నాయి. వాటిని వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

*- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ*

### ఎన్ని సిలిండర్లు ఇస్తారు ?



రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం సంవత్సరానికి ఎన్ని సిలిండర్లు ఇస్తారో చెప్పలేదు. ఇప్పటివరకు పింఛన్లు పొందుతున్న వారికి ఇస్తారా.. కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలా అనే విషయంలోనూ స్పష్టత ఇవ్వాలి.

*- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే*

# ఘనంగా పాల ఉట్లు

- వైభవంగా మక్తల్ పడమటి అంజన్న బ్రహ్మోత్సవాలు

మక్తల్ టౌన్, డిసెంబర్ 27 : మక్తల్‌లో పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మార్గశిర పాడ్యమిని పురస్కరించుకొని సాయంత్రం హంసవాహన సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాంలీల మైదానంలో భక్తజన సందోహం మధ్య పాల ఉట్ల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా మక్తల్ సీఐ, ఎస్సైలు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీమాచారి, ఈవో శ్యాంసుందరాచారి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



పాల ఉట్టి కొట్టేందుకు పోటీ పడుతున్న భక్తులు



ధ్యాన మహాయాగంలో మాట్లాడుతున్న సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ

# మనిషి బుద్ధుడివలే జీవించాలి

- పరిమళ పత్రీ • కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం సభలు

కడ్తాల్, డిసెంబర్ 27 : ప్రతి మనిషి భయం లేకుండా బుద్ధుడివలే జీవించాలని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిమళ పత్రీ అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహా పిరమిడ్‌లో, పిరమిడ్ స్పిరిచ్‌వల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు ఏడో రోజుకి చేరుకున్నాయి. బుధవారం ఉదయం 5 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన, ప్రాతఃకాల ధ్యానంలో ధ్యానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రీ మాట్లాడుతూ సత్యం తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉన్నవాళ్లే పిరమిడ్‌లోకి వస్తారని తెలిపారు. ప్రముఖ హిందూ ధర్మం ప్రచారకులు రాధామనోహర్ మాట్లాడుతూ ప్రతి మనిషి సకల ప్రాణకోటి కోసం, వాటి స్వేచ్ఛ కోసం పాటుపడాలని తెలిపారు. శ్వాస మీద ధ్యాసతో శక్తి లభిస్తుందని పేర్కొన్నారు. మనల్ని మనం తెలుసుకోవడమే ఆత్మజ్ఞానం అని వివరించారు. ధ్యాన మహాయాగంలో ప్రతి రోజూ నిర్వహిస్తున్న కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ధ్యానులను అలరిస్తున్నాయి. కార్యక్రమంలో సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలాలక్ష్మారెడ్డి, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు బాలకృష్ణ, సాంబశివరావు, హనుమంతురాజు, రాంబాబు, శ్రీరామ్‌గోపాల్, శివప్రసాద్, దామోదర్‌రెడ్డి, మాధవి, లక్ష్మి, నవకాంత్, ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.



ప్రాతఃకాల ధ్యానంలో పాల్గొన్న ధ్యానులు

# రంజీట్రోఫీకి స్టాండ్‌బైగా గణేశ్ ఎంపిక



గణేశ్

మహబూబ్‌నగర్‌టౌన్, డిసెంబర్ 27 : ఉమ్మడి జిల్లాకు చెందిన గణేశ్ రంజీట్రోఫీ జట్టులో స్టాండ్‌బైగా ఎంపికైనట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ రాజశేఖర్ బుధవారం తెలిపారు. జిల్లా క్రీడాకారుడు రంజీ ట్రోఫీ జట్టులో స్టాండ్‌బైగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. కంబైన్డ్ డిస్ట్రిక్ జట్టులో ఎంపికైన గణేశ్ అద్భుత ప్రతిభ చాటాడు. ఆయా మ్యాచ్‌లలో 137, 73, 49, 91 పరుగులు చేసి ప్రతిభ చాటాడు. టోర్నీలో మొత్తం 350 పరుగులు సాధించాడు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ నుంచి రంజీ జట్టుకు ఎంపికైన వారిలో గౌస్‌బాబా ఒక్కడే ఉండడం విశేషం. దాదాపు 20 ఏండ్ల తరువాత మహబూబ్‌నగర్ నుంచి గణేశ్ ఎంపికయ్యారు. గతంలో జరిగిన హెచ్‌సీఏ టోర్నీలో సైతం ట్రిపుల్, డబుల్ సెంచరీలు సాధించిన ఘనత ఇతడికే దక్కింది. రంజీకి ఎంపిక కావడంపై జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్, ఉపాధ్యక్షులు సురేశ్‌కుమార్, వెంకటరామారావు, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, సభ్యులు కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

# ఈకేవైసీ చేయాలంటే రెండొందలా..?

- రూ.500 కూలి వదులుకొని వచ్చినా పనికావడం లేదని ప్రజల ఆగ్రహం
- జాతీయ రహదారిపై ధర్నాకు దిగిన గ్యాస్ వినియోగదారులు



మాగనూర్ హైవేపై ధర్నా చేస్తున్న గ్యాస్ వినియోగదారులు

మాగనూరు డిసెంబర్ 27: మండల కేంద్రంలోని గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ వద్ద ఈకేవైసీ చేయించుకునేందుకు రూ.200 ఎందుకు అవసరమో చెప్పాలని గ్యాస్ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేయడాన్ని నిరసిస్తూ ప్రజలు బుధవారం జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారెంటీలతో ముందుకు వచ్చిందని అందులో రూ.500కే ప్రజలకు సిలిండర్ అందిస్తానంటూ ప్రచారం చేయడంతో అధికారంలోకి రాగానే ప్రజలు గ్యాస్ సిలిండర్ కేంద్రం వద్ద ఈకేవైసీ కోసం పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకేవైసీ చేయించాలంటే రూ.200 వసూలు చేస్తున్నారని, ఈకేవైసీ తప్పనిసరి అనడంతో మహిళలు రూ.500 కూలి వదులుకొని సిలిండర్ కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు గాస్తున్నా పని అవుతుందన్న నమ్మకం లేదని దీంతో ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.700 నష్టం జరుగుతున్నదని ఆరోపించారు. అయితే జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గ్యాస్ డిస్ట్రిబ్యూటరి వారితో మాట్లాడి అందరికీ ఈకేవైసీ అయ్యేలా చూడాలని మాట్లాడడంతో వినియోగదారులు ధర్నా విరమించారు.